క్లుప్తంగా

వివాహానికి సాయం



సాయంగా నగదును అందజేస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోని టౌన్ : ఆదోని పట్టణం కిలిచినపేటకు చెందిన షేక్‌హజరత్ సాహెబ్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఆర్థిక సాయం చేశారు. ఎమ్మెల్యే నివాసంలో మృతుడి బంధువులకు నగదు అందజేశారు. ఆపదలో ఉన్న వారిని తమవంతుగా ఆదుకుంటామని ఈ సందర్భంగా మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే నేరుగా ఎమ్మెల్యేకు గానీ, తనదృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.

నేడు ఉరుకుందకు వరకు బైకు ర్యాలీ

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కమిటీ నాయకులు తెలిపారు. జుమ్మాలదిన్నె గ్రామం నుంచి జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ సాగుతుందన్నారు. జుమ్మాలదిన్నె గ్రామానికి ఉదయం 9గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, వైస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు.

ముమ్మరంగా నాడు-నేడు పనులు



ప్రాథమిక పాఠశాల గదుల నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని హిందు గర్ల్స్ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నాడు-నేడు రెండవ విడుత కింద రూ.8లక్షలతో అదనపు గదుల నిర్మాణ పనులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజన్న పర్యవేక్షిస్తున్నారు. జూన్ 12న పాఠశాల తెరిచే లోపు పనులను పూర్తి చేయిస్తామని సంజన్న తెలిపారు.

రెండు కార్లు ఢీ

మంత్రాలయం రూరల్: మంత్రాలయం సమీపంలో మాధవరం రోడ్డు వైపున రెండుకార్లు ఢీకొన్నాయి. రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు కారులో తిరుగు పయనంలో ఒకదాని వెంట ఒకటి వెళ్తున్నాయి. అయితే వేగంగా ముందు వెళ్తున్న కారును వెనుక వస్తున్న మరోకారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కారు ముందు భాగం మాత్రం ధ్వంసమైంది.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ఆదోని టౌన్ : దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను ఆదివారం ఆదోనిలో ఘనంగా జరిగాయి. నిర్మల్ టాకీస్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, అభిమానులు పాలాభిషేకం, జలాభిషేకం చేశారు. గజమాల వేసి నివాళులర్పించారు.

కనుల పండువగా పల్లకీ సేవ

మంత్రాలయం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో బంగారు పల్లకీ సేవ ఆదివారం కనులపండువగా సాగింది. స్వామివారి వెండి బృందావన ప్రతిమను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారంలో వేలాది మంది భక్తుల మధ్య ఊరేగించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి పల్లకీసేవను దర్శించుకున్నారు. అనంతరం భక్తులు గ్రామదేవత మంచాలమ్మ, స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో మఠం కిటకిటలాడింది.

పట్టుదలతోనే లక్ష్య సాధన

కర్నూలు (సిటీ): పట్టుదలతో చదివితే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని మదనపల్లి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. కోల్స్ కాలేజీ 1988-1990 బ్యాచ్ ఆర్ట్స్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. నగరంలోని స్థానిక శ్రీలక్ష్మి కల్యాణమండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమకు కాలేజీలో విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించడంతో నేడు మంచి స్థానాల్లో ఉన్నామన్నారు. కోల్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి మాట్లాడుతూ కాలేజీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. ఇక్కడ చదివిన వారు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. ఇటీవలే కాలేజీకి ప్రతిభ అవార్డు కూడా వచ్చినట్లు చెప్పారు. అనంతరం అధ్యాపకులు మోజెస్, పాల్ అగస్టీన్, సీనియర్ జర్నలిస్ట్ సాయికుమార్ మాట్లాడారు. అంతకు ముందు పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కాలేజీ తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. నాడు విద్యను బోధించిన గురువులను సత్కరించారు.

మతసామరస్యానికి ప్రతీక... ఖాదర్‌లింగస్వామి దర్గా

- 31న ప్రారంభ కానున్న ఉరుసు
- వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో వెలసిన శ్రీజగద్గురు ఖాదర్‌లింగ దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. భగవంతుడు ఏ ఒక్క మతానికి పరిమితం నిరూపించిన మహనీయుడు శ్రీజగద్గురు ఖాదర్‌లింగ స్వామి. ఈయన చరాచర జీవకోటి రాశులకే మూల సూత్రమైన పరమేశ్వరుడినే మెప్పించిన ఓ ముస్లిం శ్రీజగద్గురు అని ఖాదర్‌లింగ స్వామి చరిత్ర చెబుతుంది. హిందూ ముస్లింలచే ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా జరిగే ఉరుసు పర్వదినాన ప్రత్యేక పూజలందుకుంటున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి 319వ ఉరుసు వైభవంగా జరగనుంది. 31వతేదీన స్వామి సమాధికి సుగంధ పానీయాలతో శుభ్రం చేస్తారు. జూన్ 1న (గురువారం) గంధం, 2న (శుక్రవారం) ఉరుసు ఉత్సవం, 3న (శనివారం) సఫ్‌రా (ప్రసాదం పంపిణీ), 4వ తేదీన (ఆదివారం) జియారత్ వేడుకలు ఉంటాయని ధర్గా దర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చీష్టీ తెలిపారు. ఈస్వామిని శ్రీజగద్గురు మహపురుష సయ్యద్-షా-ఖాదర్‌లింగస్వామిగా ఈ ప్రాంతవాసులతో నిత్యం కొనియాడబడుతున్నారు. అయితే ఈప్రాంతంలో ఖాదర్‌లింగ, లింగ్ బంద్, జగద్గురు ఖాదర్‌లింగస్వామి, ఖాదర్‌వలిగా కూడా పేరుగాంచారు.

స్వామి వారి చరిత్ర

పూర్వం కర్ణాటక రాష్ట్రంలోని బిజాపూర్ పట్టణంలో కొలవైన అమినూద్దీన్ అలిఆలా షేర్‌ఏఖుదా గురువు గారి వద్ద 12సంవత్సరాలు శిష్యరికం చేశారు. గురువు ఆజ్ఞానుసారం మానవుల్లో మత మౌఢ్యాన్ని తొలగించి మతసామరస్యాన్ని చాటేందుకు కర్ణాటక సరిహద్దులో ఉన్న కౌతాళానికి వచ్చారు. ఈయన లింగాన్ని ధరించడాన్ని ఈప్రాంతంలో ఉన్న శైవమతస్థులు కొందరు అభ్యంతరం తెలిపారు. భగవంతుడు ఎవరి సొంతం కాదని, పరమేశ్వరుని ప్రతిక అయిన లింగంపై ఎవరికీ హక్కు లేదని ఆయన వారితో వాదించారు. శైవమతస్థులను సమావేశపరిచి వారి మేడలో ఉన్న లింగాలను బావిలో వేసి వాటిని మరలా రప్పించి ధరించాలని, తాను కూడా అల చేయలేని పక్షంలో గ్రామం వదలి వెళ్తానన్నారు. అయితే లింగాలను బావిలో నుంచి బయటకు తెప్పిస్తే ఈ స్థలాన్ని శ్వాశతంగా తాను ఉండడానికి అంగీకరించాలని ఒప్పందం చేసుకున్నారు. ఈప్రయత్నంలో ఆయన శివున్ని మెప్పించి లింగాలను బావినుంచి రప్పించారు. అప్పటి నుంచి గ్రామస్తులంత మత సామరస్యంతో ఆయనను ఖాదర్‌లింగ స్వామిగా పూజించనారంభించారు. ఆయనకు ముగ్గురు భార్యలు ఐదు మంది కుమారులు. 319సంవత్సరాల క్రితం ఆయన గ్రామస్తులు ఇచ్చిన స్థలంలోనే సమాధి అయ్యారు. ఆయన వంశస్థులు అయిన ప్రస్తుత ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్టీ ట్రస్టీగా ఉన్నారు.



ఖాదర్‌లింగ స్వామి సమాధి



దర్గా ముఖద్వారం



60అడుగుల దర్గా గోపురం

రూ. కోటితో దర్గా అభివృద్ధి



దర్గా ధర్మకర్త

దర్గాను సుమారు కోటి రూపాయలతో అభివద్ధి పనులు పూర్తి చేసినట్లు దర్గా ధర్మకర్త మున్నపాషా తెలిపారు. భక్తుల సహకారంతో పనులు పూర్తి చేశాం అన్నారు. ఇప్పటికే రూ. 45లక్షలతో 60 అడుగుల గోపురం, దర్గా ఆవరణ చుట్టు పాలికా ర్బానేట్ షీట్‌లను బొంబాయికి చెందిన భక్తులు రూ. 30లక్షలతో నిర్మాణం పూర్తి అయిందని తెలిపారు. దర్గా ముందు భాగంలో మహాద్వారాన్ని సుమారు రూ. 40లక్షలతో కర్ణాటక రాష్ట్రం గంగవతి భక్తులు ఇచ్చిన సహకారంతో నిర్మాణపు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆదోనికి చెందిన భక్తుడు ఇచ్చిన రూ. లక్షాతో రెండు ద్వారాలను అమర్చినట్లు తెలిపారు. మరో కర్ణాటక భక్తుడు ఇచ్చిన సహకారంతో దర్గాలో బండాపరుపు పనులు కూడా పూర్తి చేశామన్నారు. భక్తుల సహకారంతో ఆవరణంలో మజీద్ నిర్మాణం కూడా పూర్తి అయ్యిందని, మజీద్ ముందు భాగంలో మరో ద్వారాన్ని నిర్మించామని, వీటి నిత్వరలో ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉరుసు ఉత్సవ ఏర్పాట్లు

ఉరుసు మహోత్సవాలలో పాల్గొనే భక్తులకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్గా ధర్మకర్త మున్నపాషా తెలిపారు. మనరాష్ట్రం నుంచే మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఢిల్లీ, జమ్ముకాశ్మీర్ తదితర రాష్ట్రాలతోపాటు ఇతర దేశాల నుంచి భక్తుల తరలివస్తారని ఆయన తెలిపారు. ఈసందర్భంగా బెంగళూరు, హైదరాబాదుకు చెందిన కళాకారులతో ఖవ్వాలి పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ ప్రముఖులు, నాయకులు, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీ తదితర శాఖల సిబ్బంది ఉరుసు ఉత్సవాలకు సహకరించాలని దర్మకర్త కోరారు.

దర్గాలో ప్రత్యేక అలంకరణ

దర్గా గోపురం 60 అడుగులతో ఎంతో సుందరంగా ఉంది. దీని లోపలి భాగంలో నూతనంగా గ్లాస్ ఫిట్టింగ్‌తో వివిధ రంగులతో ప్రత్యేక హాదిసు ఆయాత్‌లు (ఉర్దూలో) గ్లాసుల్లో అమర్చారు. ఈపనులను ర. 25లక్షలతో కర్ణాటక రాష్ట్రం హుబ్బీళ్లికి చెందిన భక్తులు పూర్తి చేశారని ధర్మకర్త తెలిపారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

కర్నూలు కల్చరల్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.అమర్నాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం వీఆర్ కాలనీలో మానవతా సంస్థ సభ్యుల సమావేశం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ కర్నూలు యూనిట్ పలు సేవా కార్యక్రమాలు నిస్వార్థంగా చేయడం అభినందనీయమన్నారు. జగన్నాథగట్టుపై వచ్చే వర్షాకాలంలో సుమారు 7000 మొక్కలు నాటేందుకు ముందుకు రావడం మంచి పరిణామన్నారు. ప్రముఖ హోమియోపతి వైద్యుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మానవతా సంస్థ చేస్తున్న సేవ స్ఫూర్తి దాయకంగా ఉందన్నారు. ఉచిత ఫ్రీజర్ బాక్స్, వైకుంఠ రథం, రక్తదానం శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం బ్లడ్ అండ్ ఐ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. డ్వామా పీడీ ఈ శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. సంస్థ జిల్లా కన్వీనర్ మనోహర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మానవతా సంస్థ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ పాటిల్ హనుమంతరెడ్డి, బ్లడ్ అండ్ ఐ డొనేషన్ కమిటీ ఛైర్మన్ వెంకట్ రాజు, వైస్ ఛైర్మన్ శోభన్‌బాబు, సభ్యులు మిజ్ మిల్, మీనాక్షిరెడ్డి, ప్రభాకర్, ఈశ్వర్‌రెడ్డి, హరికిషన్, రాజసింహారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, శశిధర్, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన

ఆదోని రూరల్ : పాండవగల్ పెద్ద చెరువును ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల ముగింపు సందర్భంగా దీక్షలకు మద్దతుగా నాయకులు ఆదివారం సాయంత్రం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు, ఎల్లెల్సీ ఆయకట్టు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెద్దహరివాణం ఆదినారాయణ, మండల కార్యదర్శి లింగన్న, నాయకులు రామాంజనేయులు, సాధన కమిటీ నాయకులు తాహేర్‌వలీ మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెద్దచెరువును స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోవిందు, పాండురంగ, అనీఫ్‌బాషా, సభ్యులు భీమాంజనేయులు, నర్సిరెడ్డి, కృష్ణ, డిజైనర్స్‌రెడ్డి, యు.హనుమంత రెడ్డి, హనుమంతరెడ్డి, మాబాషా, ఉసేని, రమేష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామం వాసుబాబు రైస్ మిల్లు సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటోను ఢీ కొనడంతో ఆటోలో ఉన్న ఆవు మృతి చెందగా, ఇద్దరికి గాయాలు అయ్యాయి. దేవనకొండ మండలం బండగట్టు గ్రామానికి చెందిన పెద్ద నాగన్న ట్రాలీ ఆటోలో ఆవు, కోడెదూడను ఎమ్మిగనూరులో జరిగే పశువుల సంతకు తీసుకువచ్చాడు. పశువుల సంతలో కోడెదూడ విక్రయం కాగా ఆవు సరైన ధర పలకకపోవటంతో ఆటోలో ఆవును తిరిగి ఇంటికి తీసుకెళ్తున్నాడు. రైస్ మిల్లు దగ్గరకు రాగానే కర్నూలు నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటో నుజ్జ నుజ్జ కాగా, ఆవు మృతి చెందింది. ఆటో డ్రైవర్ రాముడు, పశువుల యజమాని పెద్దనాగన్నలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదంలో గాయపడ్డ పడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఆవు విలువ దాదాపు రూ. 20 వేలు పైగా ఉంటుందని బాధితుడి బంధువులు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ట్రాలీ ఆటో

రోడ్డుపై ఆందోళనకు దిగిన స్థానికులు..

రోడ్డు ప్రమాదానికి కారణం ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యమేనని, అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి బంధువులతో పాటు స్థానికులు రోడ్డుకు అడ్డంగా కూర్చొని ఆందోళనకు దిగారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రూరల్ పోలీసులు కలుగచేసుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

చిరుత దాడిలో మేక మృతి

కోసిగి: మండల పరిధిలోని గౌడగల్లు గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో గొర్రెల, మేకల మందపై శనివారం రాత్రి చిరుత పులి దాడి చేసింది. దాడిలో కోసిగికి చెందిన వల్రాని దస్తగిరి మేకను చిరుత పట్టుకుని కొండలోకి పరుగులు తీసింది. గమనించిన గొర్రెల కాపరులు అరుపులు, కేకలు వేయడంతో మేకను అక్కడి వదిలేసి వెళ్లిందని గొర్రెల కాపరులు తెలిపారు. బాధితులు ఫారెస్ట్ ఆఫీసర్‌లకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం ఉదయం పశువైద్యాధికారి సంతోష్ కుమార్ గ్రామానికి చేరుకుని పోస్టుమార్టం చేశారు. చిరుత దాడి వలన మృతి చెందినట్లు నిర్ధారించారు. కుప్పగల్ బీట్ ఆఫీసర్ షమిఉల్లా కేసు నమోదు చేసుకుని జిల్లా ఉన్నత అధికారులకు నివేదిక పంపుతామన్నారు. బాధిత గొర్రెల కాపరికి నష్టపరిహారం వచ్చేలా చూస్తామన్నారు. అయితే కొండ ప్రాంతాల్లో గొర్రెల మందను ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిరుతలకు హాని కలిగించరాదని సూచించారు.



మృతి చెందిన మేక పరిశీలిస్తున్న పశువైద్యాధికారి సంతోష్‌కుమార్

డివైడర్‌ను ఢీ కొన్న ఇన్నోవా

ఎమ్మిగనూరురూరల్: పట్టణ సమీపంలోని ఎంజీ పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారి (ఎన్‌హెచ్167)పై కర్ణాటకకు చెందిన ఇన్నోవా వాహనం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి మంత్రాలయంకు దర్శనం కోసం వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుంది. అయితే ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ఎంజీ పెట్రోల్ బంక్ సమీంలోని డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడ్డ ఇన్నోవా

స్కూటర్లు ఢీకొని ముగ్గురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి రెండు స్కూటర్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. గుడేకల్ నుంచి ఎమ్మిగనూరుకు బైక్‌పై వస్తున్న తిమ్మప్ప, నాగన్నలు.. ఎమ్మిగనూరు నుంచి గుడేకల్‌కు వెళ్తున్న నరసింహులు బైక్ ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. దీంతో రెండు బైక్‌లపై ఉన్న ముగ్గురికి గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో నాగన్నకు కాలువిరిగింది.

పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ఆదోని రూరల్ : సర్వే సీపీటీ పరీక్ష ఫెయిల్ అయిన 1500 మంది గ్రేడ్-2 వీఆర్వోలకు ముందుగా ప్రొబేషన డిక్లర్ చేసి, ఒక సంవత్సరంలో పరీక్షలు పాస్ అవ్వడానికి సడలింపు ఇవ్వాలని ఆదివారం గ్రేడ్-2 వీఆర్వోలు శోభారాణి, మంజుల తదితరులు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో చాలామంది పరీక్షలు రాసినా పని ఒత్తిడి కారణం, కరోనా సమయంలో ఇబ్బందులు పడుతూ పరీక్ష ఫెయిల్ అయ్యామన్నారు. మరోసారి అవకాశం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న దృశ్యం

బీజేపీ బలోపేతానికి కృషి

ఆదోని అర్బన్ : బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆదోని పట్టణంలోని మంగళ ఆంజనేయ స్వామి దేవాలయ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీబాత్ 101వ ఎపిసోడ్ కార్యక్రమం అనంతరం బీజేపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నో పథకాలను ప్రజల కోసం ఏర్పాటు చేశారని, నేడు దేశం మార్పు జరుగుతుందంటే ఆయన కృషి ఫలితమేనని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బోయ మహాదేవ్, మునిస్వామి, శ్రీనివాసులు, యువరాజు, తోవి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక భావాన్ని కలిగి ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని నరసరావుపేట ఇస్కాన్ టెంపుల్ ప్రవచకులు శ్రీనివాస్ ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభుపాదుల ప్రేమ విందు, భగవద్గీత తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం, శ్రవణంతో సమస్యలకు పరిష్కార మార్గాలు దొరుకుతాయన్నారు.

పేదలకు అండగా నిలుస్తాం

ఆదోని టౌన్ : పేదలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన నివాసంలో సాయిబాబానగర్‌లో నివాసముంటున్న శృతి, విఠల్‌దాస్ కుమార్తె సంధ్యారాణి వివాహానికి తాళిబొట్టు, కాలిమెట్లు, నగదు సాయంగా అందజేశారు. ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న పేదలు, వివాహాలు, వైద్యం చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వారికి అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, లక్ష్మన్న, రాముడు పాల్గొన్నారు.



సంధ్యారాణి వివాహానికి తాళిబొట్టు, కాలిమెట్లు, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకులు ఈరన్న

కోసిగి: మండలంలోని హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఈరన్న కోరారు. ఆదివారం కోసిగిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మండల హమాలీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ వ్యాపార దుకాణాల్లో హమాలీలుగా వందలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. వీరు పనిచేసే ప్రదేశంలో ప్రమాదం జరిగిన, ఆరోగ్యం క్షీణించినా ఆ కుటుంబాల జీవితాలు దుర్భరంగా మారుతోందన్నారు. కార్మికులకు ప్రమాద బీమా వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష, హమాలీ సంఘం నాయకులు నరేష్, నాగేష్, మేకల ఈరన్న, బెంగి తిక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాగుకు...సానుకూలం!

- ఆర్బీకేలలో అందుబాటులో విత్తనాలు
- 1న అందనున్న పెట్టుబడి సాయం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

కోసిగి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సాగుకు అన్ని పరిస్థితులు సానుకూలం అవుతున్నాయి. ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి వ్యవసాయ కష్టాలు లేకుండా ముందస్తు రైతులకు అవసరం మేరకు సమకూర్చుతోంది. గతంతో పోలిస్తే పకృతి కూడా కనికరిస్తుంది. సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో మంచి దిగుబడి సాధిస్తున్నారు రైతులు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఖరీఫ్ ప్రారంభం కానుంది. రైతు భరోసా కేంద్రాల్లో రైతుల అవసరం మేరకు అధికారులు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచారు. ఆర్బీకే కేంద్రాల్లో విత్తనాలు కొనుగోలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం రైతులకు కల్పించారు. రైతులు తమ పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ అందించి అవసరమైన ఎరువులు విత్తనాలు పొందవచ్చు. అలాగే పంటలు సాగు చేసుకునేందుకు నాల్గవ విడుత పెటుబడి సాయం రైతు భరోసాను జూన్ ఒకటవ తేదీన పత్తికొండలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. సాగుకు ముందే రైతు భరోసా విడుదల చేయడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మేరకు సాగుకు పెట్టుబడి సాయం కింద నాల్గవ విడత వైఎస్సార్ రైతు భరోసా రైతన్న ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్ద కడబూరు మండలాల్లో 43,586 మంది రైతులకు రూ.23,97,23,000 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ కానుంది.



ఆర్బీకేలలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఎరువులు, విత్తనాలు

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

ఖరీఫ్ సాగుకు రైతన్న సన్నద్ధం అవుతున్నాడు. ట్రాక్టర్లు, ఎద్దులతో దుక్కిదున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. విత్తన శుద్ధి చేసుకోవడం, గబ్బురం చల్లుకోవడం వంటి పనులు చేపట్టారు. మరికొందరు రైతులు బోరు బావుల కింద విత్తనాలు విత్తుతున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో కోసిగిలో 3240 ఎకరాలు, పెద్దకడబూరు- 32,730 ఎకరాలు, మంత్రాలయం - 31,560 , కౌతాళంలో 45,450 ఎకరాలు ఖరీఫ్ సాగు అంచనా. ఈ మేరకు రైతులకు ఆయా మండలాలలో రైతులకు అవసరం మేరకు వేరుశనగ, జీలుగా విత్తనాలు, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతులకు వ్యవప్రయాసాలు లేకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల్లోనే అందుబాటులో ఉంచారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రాలయం నియోజకవర్గంలో వైఎస్సార్ రైతు భరోసా కింద

మండలం	రైతులు	సాయం(రూ.కోట్లలో)
కోసిగి	9664	రూ. 5,31,52,000
పెద్దకడబూరు	9888	రూ. 5.43,84,000
కౌతాళం	15102	రూ. 8.30,61,000
మంత్రాలయం	8932	రూ. 4,91,26,000
మొత్తం	43,585	రూ. 23,97,23000

ప్రభుత్వం రైతులకు చాలా మేలు చేస్తోంది



రైతుల కష్టాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోనే విత్తనాలు ఎరువులు, అందుబాటులో ఉంచింది. విత్తనాలు తెచ్చుకునేందుకు కూడా పెట్టుబడి సాయం వస్తోంది. గతం ప్రభుత్వంలో విత్తనాల కోసం ఆదోనికి వెళ్లి క్యూలో వేచి తెచ్చుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతుల పక్షాన ఉండి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు మేలు చేస్తున్నాడు. – చిన్న సత్యన్న, రైతు, కోసిగి

అర్హత ఉన్న వారందరికీ రైతు భరోసా



మండలంలోని అర్హత కలిగిన ప్రతి రైతు వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందుతుంది. రైతుల ఖాతాల్లోకి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నగదు జమ చేయనున్నారు. అలాగే ప్రతి ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం. అవసరమైన రైతులు తమ పట్టదారు పాసుపుసకం, ఆధార్ కార్డు అందించి విత్తనాలు పొందవచ్చు. – రాజు, ఏఓ